సాక్షి అనకాపల్లి


మంగళవారం । 12 । నవంబర్ । 2024



పునరావృతం కాకుండా..

ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. వినతులు రీఓపెన్ కారాదని ఆదేశించారు.

8లో



15న పుణ్యనదీ హారతి

సింహాచలం: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఈనెల 15న సింహగిరి వరాహ పుష్కరిణిలో పుణ్యనదీ హారతి నిర్వహించనున్నారు.



హీరోయిన్ లావణ్య పూజలు

సీతమ్మధార: హీరో వరుణ్ తేజ్ సతీమణి, హీరోయిన్ లావణ్య త్రిపాఠి సంపత్ వినాయగర్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

రైతులకు మోసం



బడ్జెట్‌లో రైతులకు మేలు జరిగే అంశాలు లేవు. గత ప్రభుత్వంలో ఖరీఫ్ సీజనుకు ముందుగానే పెట్టుబడి సాయంగా నగదు వేసేవారు. కూటమి ప్రభుత్వం రైతులకు ఏటా రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. ఇపుడు బడ్జెట్ చూస్తే కొంత మంది రైతులకే సాయం అందుతుందని తెలుస్తోంది. ఇంత మోసం చేస్తారనుకోలేదు.

– తమరాన నర్సింహమూర్తి, రైతు, కె.వెంకటాపురం, కోటవురట్ల మండలం

తల్లికి వంచన



'తల్లికి వందనం' పథకం పేరుతో చంద్రబాబు వంచించారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అమ్మ ఒడి డబ్బులు స్కూల్‌కి వెళ్లే సమయానికి అందేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి అయిదు నెలలు గడిచినా ఆ ఊసే లేదు. ఇప్పుడు బడ్జెట్ కేటాయింపు లేదు. ఎందరు పిల్లలుంటే అందరికీ రూ.15 వేలు ఇస్తామని చెప్పారు. ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి మాట తప్పారు.

–కోరెడ్డి లక్ష్మి, కొరుప్రోలు, ఎస్.రాయవరం మండలం

మహిళలకు అన్యాయం



మహిళల పట్ల కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. ఎన్నికల ముందు చంద్రబాబు మహాశక్తి పథకంలో 18–59 సంవత్సరాల మధ్య వయసు వారికి ప్రతి నెల రూ.1500 ఇస్తామని హామీ ఇచ్చారు. ఐదు నెలలైనా ఉలుకూ పలుకూ లేదు. బడ్జెట్‌లో ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో రాష్ట్రంలో మహిళలు దగా పడ్డారు. చంద్రబాబుకు మోసగించడం అలవాటే.

–వెంకటలక్ష్మి, గృహిణి, లింగంపేట గ్రామం, గొలుగొండ మండలం

అన్నదాతపై చిన్నచూపు



చంద్రబాబు ప్రభుత్వానికి రైతులపై మొదటి నుంచి చిన్నచూపే. ఎన్నికల ముందు రైతులకు రూ.20 వేలు ఇస్తామన్నారు. కనీస స్థాయిలో బడ్జెట్‌లో రైతులకు మేలు చేయలేదు. ప్రభుత్వం వచ్చి ఐదు నెలలవుతున్నా ఇప్పటి వరకు ఎటువంటి మేలు జరగలేదు. అన్నదాత సుఖీభవ పథకం రైతులకు వర్తింపజేసేందుకు అనేక ఆంక్షలు పెడుతున్నారు. వ్యవసాయ రంగానికి మేలు చేయాలన్న చిత్తశుద్ధి ఉంటే రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి.

–నారాయణమూర్తి, రైతు, గొలుగొండ మండలం

విశాఖను ఆర్థిక రాజధానిగా చేస్తామని చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఎన్నికలకు ముందు ఊదరగొట్టారు. కానీ అధికారం చేపట్టాక రాష్ట్ర ఖజానాను నింపుకోవడానికే విశాఖను ఉపయోగించుకున్నారన్న విషయం తేటతెల్లమవుతోంది. విశాఖకు మెట్రో రైలు, ప్రత్యేక రైల్వే జోన్, పర్యాటకాభివృద్ధికి విభిన్నమైన ప్రాజెక్టులు అని గప్పాలు కొట్టిన చంద్రబాబు.. ఇప్పుడు బడ్జెట్ కేటాయింపుల్లో ఉమ్మడి విశాఖ ప్రస్తావనే చేయకపోవడం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. ప్రత్యేక రైల్వే జోన్ పనులను పరుగులు పెట్టిస్తామని ఇటీవలే చంద్రబాబు విశాఖ పర్యటనలో ప్రకటనలు చేశారు. అయితే జోన్ ఏర్పాటుకు అవసరమయ్యే మ్యాచింగ్ గ్రాంట్ నిధులకు మాత్రం బడ్జెట్‌లో కేటాయించలేదు. త్వరలోనే మెట్రో రైలు పనులు ప్రారంభమవుతాయని చెప్పినప్పటికీ.. బడ్జెట్‌లో ఆ ప్రాజెక్టు ఊసు కూడా లేదు. ఇక పర్యాటకం విషయాన్ని కనీసం పట్టించుకోలేదు.



విశాఖ ప్రస్తావనే లేదు..



అన్నీ కోతలే..

బడ్జెట్‌లో సూపర్ సిక్స్ హామీలు గాలికి.. ■ మహిళలు, నిరుద్యోగులకు అన్యాయం

రైతుల నోట్లో మట్టి.. విద్యార్థుల సాయానికి మంగళం ■ మరోసారి బాబు మార్కు మోసం

విశాఖ సిటీ: ఇంటర్ వరకు చదువుతున్న ప్రతి పిల్లాడికి రూ.15 వేలు అంటూ తల్లికి.. ప్రతి నెల రూ.1,500 ఆర్థిక సాయం అంటూ మహిళలకు.. పెట్టుబడి సాయం కింద ఏటా రూ.20 వేలు అంటూ అన్నదాతకు.. ఇలా ఒకటి కాదు.. రెండు కాదు.. అధికార పీఠం కోసం అలవి కాని హామీలిచ్చిన చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక ఎప్పటిలాగే తూచ్ అన్నారు. అసెంబ్లీలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఇందుకు నిదర్శనం. ఇందులో సూపర్ సిక్స్ ఊసేలేదు. రైతుకు భరోసా లేదు. తల్లికి వందనం లేదు. మహిళలకు ఆర్థిక సాయం లేదు. నిరుద్యోగులపై కనీసం దృష్టిపెట్టలేదు. అలాగే నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు, మెట్రో రైలుకు, పర్యాటకాభివృద్ధికి, అనకాపల్లి పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు పైసా కూడా కేటాయించలేదు. ఎన్నికలకు ముందు ప్రతి సభలోను హామీల కూత పెట్టిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చాక మాత్రం గత ప్రభుత్వ పథకాల్లోనే కోతలు పెట్టారు. కొత్త పథకాలకు పైసా కూడా విదల్చని బాబు.. ఉన్న పథకాలకు సైతం మంగళం పాడేలా బడ్జెట్ కేటాయింపులు చేసి మరోసారి తన బుద్ధి చూపించారు.



స్టీల్‌ప్లాంట్‌కు నిధులేవి..?

స్టీల్‌ప్లాంట్ మూల ధనం కోసం రూ.2 వేలు కోట్లు సాయం చేయాలని ఉక్కు పరిశ్రమ పరిరక్షణ సంఘం నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని వేడుకున్నారు. అయిదు నెలల తరువాత రాష్ట్ర ప్రభుత్వ నిర్మాణాలకు అవసరమయ్యే ఉక్కును ఈ నిధుల ద్వారా కొనుగోలు చేయాలని ప్రతిపాదించారు. కానీ కూటమి ప్రభుత్వ బడ్జెట్‌లో స్టీల్‌ప్లాంట్‌ను కూడా పట్టించుకోలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఈ నిధులను సమకూర్చేందుకు ప్రత్యేక కమిటీని సైతం ఏర్పాటు చేసింది. ఆ కమిటీ ప్రతిపాదనలను సైతం కూటమి ప్రభుత్వం బుట్టదాఖలు చేసింది. తాజాగా స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం పోరాడుతున్న అఖిలపక్ష నాయకులు ఈ విషయాన్ని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లినా.. కనీసం పైసా కూడా కేటాయించకపోవడం కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఎంటో అర్థమవుతోంది.



ఉత్తరాంధ్రకు మరోసారి అన్యాయం



రాష్ట్ర బడ్జెట్ తీవ్ర నిరాశ పరిచింది. ఈ ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున పోరాడుతున్నా, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను రక్షిస్తామనే కనీస ప్రస్తావన కూడా బడ్జెట్ ప్రసంగంలో లేదు. రాష్ట్రంలోనే అతి పెద్ద భారీ పరిశ్రమగా ఉన్న దీనిని కాపాడుకోకుండా, ఎన్ని పారిశ్రామిక విధానాలు ప్రకటించినా, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేస్తామన్నా ప్రజలను మోసగించడం తప్ప మరొకటి కాదు. రాష్ట్ర విభజన చట్టంలోని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజీలు, రైల్వే జోన్, విశాఖ మెట్రోరైల్, గిరిజన వర్సిటీతో సహా విద్యా సంస్థల నిర్మాణంలో కేంద్రం చేస్తున్న జాప్యం గురించి రాష్ట్ర ప్రభుత్వం గమనించినట్లే లేదు. గిరిజన కార్పొరేషన్‌ను బలోపేతం చేయవలసిన అవసరం ఉండగా కనీసం ఆ ఆలోచన కూడా ప్రభుత్వానికి లేదు.

– ఎ.అజశర్మ, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి

పెట్టుబడి సాయం ఎక్కడ?



చంద్రబాబు ఈ ఏడాది ఎన్నికల ప్రచార సమయంలో రైతులకు ఏడాదికి రూ.20 వేల పెట్టుబడి సహాయం అందిస్తానని ప్రకటించారు. పదవిని చేపట్టిన తరువాత ఖరీఫ్ సాగు ప్రారంభ సమయంలో మాట నిలుపుకుంటారని ఎదురుచూశాం. నేటికీ అన్నదాత సుఖీభవ పథకం కింద పైసా సహాయం రైతన్నకు చేరలేదు. ఈ రోజు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ.4500 కోట్లు మాత్రమే కేటాయించారు. లబ్ధి పొందే రైతుల సంఖ్యను తగ్గిస్తారేమోనన్న ఆందోళన రైతుల్లో ఉంది.

–నెక్కల పెంటయ్య, రైతు, గవరపాలెం గ్రామం, కె.కోటపాడు మండలం

జగన్ పాలన స్వర్ణయుగం



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతులకు ఎంతో మేలు జరిగింది. వ్యవసాయ పెట్టుబడులకు రూ.13,500 సకాలంలో సీజన్‌కు ముందే అందించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్నదాతకు ఒరిగిందేమీలేదు. ఖరీఫ్ సీజన్ చివరి దశకు వచ్చినా రైతులకు పెట్టుబడి సాయం అందలేదు. ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో చంద్రబాబు ప్రభుత్వం విఫలమైంది. అన్నదాత సుఖీభవ పథకం అమలు చేసి చిత్తశుద్ధి చూపాలి.

–కాండ్రేగుల కిరణ్‌కుమార్, రైతు, చూచుకొండ, మునగపాక మండలం

చెరకు ఊసెత్తలేదు



బడ్జెట్‌లో చెరకు పంట ఊసెత్తలేదు. ఇప్పటికే చెరకు సాగుకు రైతులు ముందుకు రావడం లేదు. కనీసం గిట్టుబాటు ధరపై ప్రోత్సాహమైనా ఇస్తారని ఆశ పడ్డాం. కానీ ఏమీ ప్రకటించలేదు. జూన్ నెలలో ఇవ్వాల్సిన పెట్టుబడి సాయం ఇప్పటి వరకు అందలేదు. ఇంకా ఇప్పుడు బడ్జెట్‌లో పెట్టామని, అది కూడా కేంద్రం ఇచ్చే రూ.6 వేలతో కలిపి రూ. 20 వేలు ఇస్తామని చెబుతున్నారు.

– పాము అప్పలనాయుడు, చెరకు రైతు, చోడవరం

రైతుల నడ్డి విరిగినట్టే..



రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన బడ్జెట్ చూస్తే రైతులందరికీ పెట్టుబడి సాయం అందేలా లేదు. ఎన్నికల ముందు ఏడాదికి రూ. 20 వేలు అందిస్తామన్న ప్రభుత్వం గద్దెనెక్కి ఆరు నెలలైనా పెట్టుబడి సాయం ఊసెత్తలేదు. కొత్తగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పది వేల కోట్లకు సగం నిధులు కూడా కేటాయించలేదు. దీంతో పెట్టుబడి సాయం అందక రైతుల నడ్డి విరిచినట్టే ఉంది.

– సయ్యపురెడ్డి కొండబాబు, రైతు, వడ్డాది

మహిళలను వంచించారు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500 చొప్పున చెల్లిస్తామని హామీ ఇచ్చారు. సోమవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నిధులు కేటాయించడం, ఎప్పటి నుంచి అమలు చేస్తారో ప్రస్తావించకపోవడం దారుణం. సూపర్ సిక్స్ పథకాలను చూసి ప్రజలంతా ఓట్లేసారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ పథకాలన్నీ వెంటనే అమలు చేయాలి.

–సూరాకాసుల రామలక్ష్మి, గృహిణి, అమలాపురం, నక్కపల్లి

విశాఖకు తీవ్ర అన్యాయం..



కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉమ్మడి విశాఖ జిల్లాకు తీవ్ర అన్యాయం చేసింది. పోలవరం ఎడమ కాలువ పనుల పూర్తికి ప్రాధాన్యం ఇవ్వలేదు. వ్యవసాయం పట్ల చిన్నచూపునకు ఈ బడ్జెట్ ఒక సంకేతం. స్టీల్‌ప్లాంట్ ప్రస్తావన లేదు. జిల్లాలో మూసివేసిన సుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తామన్న హామీ లేదు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటి హామీలు ఎప్పుడు హామీలు చేస్తారో చెప్పలేదు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్న చిత్తశుద్ధి బడ్జెటలో కనిపించలేదు.

–కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి, సీపీఎం

ఘనంగా శూలాల మహోత్సవం



శూలాలు ధరించిన భక్తుడు

మునగపాక: ఉత్తరాంధ్రలో పేరుగాంచిన మునగపాక శూలాల మహోత్సవం సోమవారం రాత్రి ఘనంగా జరిగింది. కార్తీకమాసం రెండో సోమవారం ఈ ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. సాంబశివుని ఆలయం నుంచి శూలాలు ధరించిన భక్తులు డప్పు వాయిద్యాలకు అనుగుణంగా నృత్యం చేయడం అందరినీ ఆకట్టుకుంది. శూలాల చివరన కండెలు వెలిగించి నృత్యం చేశారు. పలువురు భక్తులు నాలుక, బుగ్గల్లో శూలాలు ధరించగా మావూరి రాజు శరీరంపై భారీ శూలం ధరించి అందరినీ ఆకట్టుకున్నాడు. ఈ శూలాల ప్రదర్శన గ్రామంలోని అన్ని వీధుల గుండా ఊరేగింపుగా సాగి మంగళవారం తెల్లవారుజామున ఆలయానికి చేరుకుంటుంది. ఈ శూలాల ప్రదర్శన తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. శివపార్వతుల ఫొటోలతో కూడిన గుమ్మటం అందరినీ ఆకట్టుకుంది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ పి.ప్రసాదరావు నేతృత్వంలో గట్టి బందోబస్తు నిర్వహించారు.

అగ్రి విద్యార్థులకు వివిధ కళాశాలల్లో సీట్లు

అనకాపల్లి: ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విడుదల చేసిన అగ్రి సెట్ 2024 ఫలితాల ప్రకారం మంచి ర్యాంకులు పొందిన స్థానిక ఆర్ఏఆర్ఎస్ పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులు రాష్ట్రంలోని వివిధ కళాశాలల్లో సీట్లు పొందారు. వారు ఈనెల 13వ తేదీలోగా ధ్రువపత్రాలతో కాలేజీలో చేరాలని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ సీహెచ్. ముకుందరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఉత్తమ గురువులకు పురస్కారాల ప్రదానం



అవార్డు అందుకుంటున్న గణిత అధ్యాపకుడు సహదేవుడు



పురస్కారం అందుకుంటున్న మేథమేటిక్స్ స్కూల్ అసిస్టెంట్ షేక్ నాగూర్

రోలుగుంట/పాయకరావుపేట: ఉత్తమ గురువులుగా జిల్లా నుంచి ఎంపికైన ఇద్దరు సోమవారం అమరావతిలో జరిగిన కార్యక్రమంలో పురస్కారాలు అందుకున్నారు. రోలుగుంట జూనియర్ కాలేజీలో పనిచేస్తున్న గణిత అధ్యాపకుడు బి.సహదేవుడు, పాయకరావుపేట మండలం గుంటపల్లి జెడ్పీ హైస్కూల్ మేథమేటిక్స్ స్కూల్ అసిస్టెంట్ షేక్ నాగూర్‌లకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అవార్డులు అందజేశారు.

ఆజాద్ అడుగుజాడల్లో..



మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు నివాళి అర్పిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ జాహ్నవి



ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

తుమ్మపాల: స్వతంత్ర భారత తొలి విద్యాశాఖ మంత్రిగా భారతరత్న జనాబ్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ మన జాతీయ అవసరాలకు తగినట్లుగా విద్యావిధానం రూపొందించి, విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చారని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆజాద్ జయంతి వేడుకలను పురస్కరించుకుని మైనారిటీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ ఎం. జాహ్నవి, మైనారిటీ వర్గ ప్రతినిధులు జ్యోతి ప్రజ్వలన చేసి, మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశం అభివృద్ధి చెందాలన్నా, సమాజంలో మార్పు రావాలన్నా విద్యతోనే సాధ్యమన్నారు. ఆజాద్ ఆదర్శాలను అందరూ అనుసరించాలన్నారు. జామీ మసీదు ప్రెసిడెంటు పి.ఎస్.ఎన్.హుస్సేన్ మాట్లాడుతూ భారత దేశం మైనారిటీలకు ఉన్నత స్థానాలు, అత్యున్నత గౌరవం అందించిందని, ఎల్లప్పుడూ రుణపడి ఉంటామన్నారు. డీఆర్వో బి.దయానిధి, మైనారిటీ సంక్షేమశాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు సత్యపద్మ, షేక్ అబ్దుల్లా, మహమ్మద్ జిలానీ, ఉమర్ అబ్దుల్ అలీ, అబ్దుల్ రహమాన్, మహమ్మద్ అమన్, అబ్దుల్ గఫూర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విద్యారంగం బలోపేతం

అనకాపల్లి: స్థానిక ఎస్పీ కార్యాలయంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి ఎస్పీ తుహిన్ సిన్హా పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుడు, భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ నిర్విరామంగా పనిచేసి, జాతీయాభివృద్ధికి, విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేశారన్నారు. అదనపు ఎస్పీ ఎల్.మోహన్‌రావు, ఎస్‌బీ డీఎస్పీ బి.అప్పారావు, సీఐలు టి.లక్ష్మి, లక్ష్మణమూర్తి, బాల సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన పంచాక్షరి



కశింకోటలోని శివాలయంలో పరమేశ్వరుడికి పంచామృతాలతో అభిషేకం



అనకాపల్లి వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్తంభం వద్ద భక్తుల పూజలు

భక్తులు పోటెత్తారు. అభిషేకాలతో పరమేశ్వరుడిని పూజించారు. ఆర్తితో భక్తసులభుడిని అర్చించారు. ఓం నమఃశివాయ అంటూ పంచాక్షరి ప్రతిధ్వనులతో ఆలయాలు మార్మోగాయి. రాంబిల్లి మండలం పంచదార్ల ఉమాధర్మలింగేశ్వరుని ఆలయంలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, శివుడిని దర్శించుకున్నారు. ముద్దుర్తి సంగమేశ్వరస్వామి ఆలయం వద్ద శారదానదిలో భక్తుల కోలాహలం కనిపించింది. జిల్లా అంతటా శివాలయాలు కిటకిటలాడాయి.

–సాక్షి న్యూస్ నెట్‌వర్క్

మెట్ట భూముల్లో సిరుల సాగు

- లాభాల బాటలో ఆయిల్‌పామ్
- దిగుబడి తగ్గడంతో ఈ ఏడాది పెరిగిన డిమాండ్
- సేకరణ ధర పెంపుతో ఆనందంలో రైతులు
- జిల్లాలో 10 వేల హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు





కోసిన ఆయిల్‌పామ్ గెలలు, (ఇన్‌సెట్) గవరవరంలో సాగవుతున్న ఆయిల్‌పామ్ తోటలు

మాడుగుల: ఎందుకూ పనికిరావనుకున్న మెట్ట ప్రాంత భూముల్లో ఇప్పుడు బంగారం పండుతోంది. రైతులు ఆయిల్‌పామ్ సాగు చేస్తూ లాభాల బాట పట్టారు. జిల్లాలో 9 మండలాల్లో 10 వేల హెక్టారుల్లో దీనిని సాగు చేస్తున్నారు. మాడుగుల, దేవరాపల్లి మండలాల్లోనే 3 వేల హెక్టారుల్లో సాగవుతోంది. గత ఏడాది టన్ను ధర రూ.14 వేలు పలకగా ప్రస్తుతం రూ.19 వేలకు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మాడుగుల మండలం శంకరం, తాటిపర్తి, అవురువాడ, ఎం.కోడూరు, కేజేపురం పంచాయతీల్లో ఈ సాగు విస్తారంగా ఉంది. దేవరాపల్లి మండలంలో చింతలపూడి, తామరబ్బ, దేవరాపల్లి, కాశీపురం, మారేపల్లి, వాలాబు, గరిసింగి, తదితర గ్రామాల్లో, చీడికాడ మండలం కోనాంలో ఆయిల్‌పామ్ సాగు బాగుంది. ఆయిల్‌పామ్ సాగుకు మొదటి నుంచి ప్రభుత్వం మంచి రాయితీలు అందిస్తోంది. దీంతో సాగు చేసేందుకు రైతులు ముందుకు వస్తున్నారు. బుచ్చెయ్యపేట మండలం బంగారు మెట్ట వద్ద పామాయిల్ మిల్లు ఉంది. ఈ మిల్లు పరిధిలో మాడుగుల, బుచ్చెయ్యపేట, చోడవరం, సబ్బవరం, కశింకోట, పద్మనాభం, ఆనందపురం, అనకాపల్లి, భీమిలి మండలాల్లో విస్తారంగా ఆయిల్‌పామ్ తోటలు సాగు చేస్తున్నారు. ఈ మండలాల్లో పండించిన ఆయిల్‌పామ్ పంటను ఆయిల్‌పామ్ కంపెనీ వారు తీసుకుని క్రూడాయిల్ తయారు చేస్తారు. ఈ క్రూడాయిల్‌ను జంగారెడ్డిగూడేనికి ఎగుమతి చేస్తారు. ఆయిల్‌పామ్ గింజల నుంచి క్రూడాయిల్ తయారు చేసే కంపెనీ జిల్లాలో ఒక్క బంగారు మెట్టలోనే ఉండడం ఈ ప్రాంత ఆయిల్‌పామ్ రైతులకు వరంగా మారింది. ఆయిల్‌పామ్ మొక్క ఒక్కొక్కటి రూ.133 కాగా రైతుకు 100 శాతం రాయితీపై ప్రభుత్వం ఎకరాకు 50 మొక్కలు ఉచితంగా అందజేస్తుంది. మొక్కలు నాటిన నాలుగేళ్ల వరకు ప్రతి ఏటా హెక్టారుకు రూ.5 వేల 250 వంతున నాలుగేళ్లపాటు అందజేయడంతోపాటు 90 శాతం రాయితీపై డ్రిప్ ఇరిగేషన్ మంజూరు చేస్తారు. రైతులు అంతర పంటలు పండించుకోవడానికి హెక్టారుకు రూ.5 వేల రాయితీ అందజేస్తారు. ఐదో ఏట నుంచి పంట కాపునకు వస్తుంది. తక్కువ పెట్టుబడితో సుమారు 30 ఏళ్లపాటు శాశ్వత ఆదాయం లభిస్తుంది.

దిగుబడి తగ్గినా రాబడి పెరిగింది



ఈ ఏడాది కొంత దిగుబడులు తగ్గాయి. ఎకరాకు 8 టన్నులు రావలసింది. కానీ 6 టన్నులే దిగుబడి వచ్చింది. అయితే గత ఏడాది టన్నుకు రూ 14 వేలు ధరలు పలకగా ఈ ఏడాది రూ.19 వేలకు చేరింది. అందుబాటులో మిల్లులు ఉండడం వలన పండిన వెంటనే పంటలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఆదాయం బాగుంది.

–ఎ.వి.రామకృష్ణ, ఆయిల్‌పామ్ రైతు, మాడుగుల

నాలుగేళ్లపాటు రాయితీలు



మొక్కలు వేసిన నాలుగేళ్లపాటు ప్రభుత్వ రాయితీలు అందజేస్తారు. ఆయిల్‌పామ్ పంట దశకు వచ్చే వరకు అంతర పంటలకు రాయితీలు అందజేస్తారు. అందుబాటులో మిల్లులు ఉన్నాయి. గత నెలలో రూ.17 వేలు ధరలు పలకగా ఈ నెలలో మరో 2 వేలు పెరిగింది. ఎందుకూ పనికిరాని మెట్ట భూముల్లో ఆయిల్‌పామ్ సిరులు పండిస్తోంది.

–విజయదుర్గ, ఆయిల్‌పామ్ ఫీల్డ్ అధికారి, మాడుగుల

క్లుప్తంగా

9 కిలోల కనుజు మాంసం పట్టివేత



స్వాధీనం చేసుకున్న కనుజు మాంసం

కోటవురట్ల : కనుజు మాంసాన్ని కలిగి ఉన్న ఓ వ్యక్తిని అటవీశాఖాధికారులు అరెస్టు చేశారు. నర్సీపట్నం ఫారెస్టు రేంజర్ లక్ష్మీనర్సు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అటవీశాఖాధికారులకు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు పందూరు గ్రామంలో అటవీశాఖాధికారులు సోమవారం దాడి చేశారు. గ్రామానికి చెందిన బంగారి అప్పారావు ఇంటిపై దాడి చేయగా ఫ్రిజ్‌లో నిల్వ చేసిన 9 కిలోల కనుజు మాంసాన్ని పట్టుకున్నారు. మాంసాన్ని స్వాధీనం చేసుకుని బంగారి అప్పారావును అరెస్టు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని తెలిపారు.

సిబ్బంది నిర్లక్ష్యం వల్లే విద్యార్థినికి ప్రమాదం

- విద్యార్థి సంఘాల నేతల ఆందోళన



ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

అచ్యుతాపురం : అచ్యుతాపురం ఏపీ రెసిడెన్సియల్ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థిని యశస్వినికి ప్రమాదం జరిగిన ఘటనలో సిబ్బంది నిర్లక్ష్యం కూడా ఉందని ఆరోపిస్తూ ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, డీవైఎఫ్ఐ నేతలు సోమవారం పాఠశాల వద్ద నిరసన తెలిపారు. సిబ్బంది కొరత ఉండడం వల్ల విద్యార్థులతో పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. సాంబారు పడడం వల్ల 50 శాతం చర్మం కాలిపోయిన విద్యార్థినికి న్యాయం చేయాలని, వైద్య ఖర్చులు ప్రభుత్వం భరించాలని వారు డిమాండ్ చేశారు. సంఘటన జరిగి రెండు రోజులు గడుస్తున్నప్పటికీ ఉన్నతాధికారులు గానీ, ప్రజా ప్రతినిధులు గానీ పాఠశాలను సందర్శించలేదని ఆరోపించారు. ఆందోళనలో ఎం.రమణ, శివాజీ, జి.ఫణీంద్ర కుమార్, ఎం.బాలాజీ, బాబ్జీ, కేశవ, తరుణ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతుకు తీవ్ర గాయాలు

దేవరాపల్లి : దేవరాపల్లిలో సోమవారం రాత్రి జరిగిన ప్రమాదంలో నాగయ్యపేటకు చెందిన రైతు చలుమూరి మంగబాబు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు దేవరాపల్లి నాలుగు రోడ్ల కూడలిలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో సరుగుడు కర్రల లోడుతో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ద్విచక్ర వాహనంపై వచ్చిన మంగబాబు బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతని ఛాతిపై సరుగుడు కర్ర దిగబడడతో చాతిపైన, కాలిపైన గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు అతడిని దేవరాపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అందించారు. అక్కడి నుంచి బంధువులు మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం ఆసుపత్రికి తరలించారు.

ఫిర్యాదులు పునరావృతం కాకుండా చర్యలు

- ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్ విజయ కృష్ణన్
- పలు అర్జీల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు



దివ్యాంగుల సమస్యలపై కలెక్టరేట్ వద్ద నిరసన

తుమ్మపాల: ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను రీఓపెన్ కాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి సమస్యలను తెలుసుకుని అర్జీలను స్వీకరించారు. జాయింటు కలెక్టర్ ఎం.జాహ్నవి, జిల్లా రెవిన్యూ అధికారి బి.దయానిధి, హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస రావు పీజీఆర్ఎస్ వేదిక ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

దివ్యాంగుల నిరసన

దివ్యాంగుల చట్టం-2016 పటిష్టంగా అమలు చేయాలని, నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి సౌకర్యం కల్పించాలని కోరుతూ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక కమిటీ ఆధ్వర్యంలో దివ్యాంగులు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి జగదీష్‌కు వినతి పత్రం అందించారు. అంగవైకల్యం 80 శాతం పైన ఉన్న వారికి రూ.15 వేలు పింఛను ఇవ్వాలని, దివ్యాంగులకు మోటారు, ఎలక్ట్రికల్, ఇతర వాహనాల మంజూరుకు కఠిన నిబంధనలు తొలగించాలని కోరారు. ఒంటరి వికలాంగులకు కూడా రేషన్ కార్డులు మంజూరు చేయాలని, జిల్లా దివ్యాంగుల కార్యాలయాన్ని జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని, ఆర్టీసీ ఉచిత బస్సు సౌకర్యం అందించాలని, బ్యాక్ లాగ్‌పోస్టుల భర్తీకి జాబ్ మేళాను నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం జిల్లా కార్యదర్శి బుగిడి నూకఅప్పారావు, కొర్ని సింహచలం, ఎస్.నాగరాజు, ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

రికార్డులు మార్చి దాడికి పాల్పడుతున్నారు..

తమ భూమిని ఆక్రమించాలని చూస్తూ తమపై దాడికి పాల్పడుతున్న వారి నుంచి కాపాడాలంటూ రావికమతం మండలం ధర్మవరం గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు సందక రాజులమ్మ,



దివ్యాంగుడైన భర్త రమణ కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. సర్వే నెం.104-2లో మొత్తం 92 సెంట్ల భూమి సందన రమణ పేరున పాస్ పుస్తకం పొందామన్నారు. ఇటీవల రీసర్వేలో గ్రామానికి చెందిన దేవర నాగమణి, వమ్ము లక్ష్మి పల్లా లోవ తదితరులు భూమిని తమ పేరున నమోదు చేయించుకుని తమ భూమిలోకి చొరబడుతున్నారని ఈ నెల 9న పొలంలోకి వచ్చి తనను, వికలాంగుడైన తన భర్తను, కొడుకుపై తీవ్రంగా దాడి చేశారని, తాము ప్రాణాలు అరచేత పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు పరుగులు తీసి కాపాడాలని కోరినా పట్టించుకోలేదని అన్నారు. కలెక్టర్ స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

తల్లి పేరున గల భూమిని లాక్కున్నారు..

80 ఏళ్ల వృద్ధాప్యంలో ఉన్న తన పేరున గల భూమిని కుమారులు ఆన్‌లైన్ చేసుకుని, అడిగితే దాడి చేస్తున్నారని నాతవరం మండలం పీకే గూడెం



గ్రామానికి చెందిన లగుడు నారాయణమ్మ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. 12.58 ఎకరాల భూమిని ఇద్దరికీ పంచి ఇవ్వగా మిగిలిన 2.22 ఎకరాల భూమి తన పేరున ఉందని, సర్వే నెం.64 లో గల 2.22 ఎకరాల భూమిని కూడా తనకు తెలియకుండా రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై సొంతం చేసుకున్నారని, తనకు న్యాయం చేయాలని కోరింది.

ఆక్రమణల్లో చెరువులు, గెడ్డలు

తమ గ్రామంలో ఆక్రమణకు గురైన చెరువు, గెడ్డలను కాపాడాలని రొంగళివానిపాలెం గ్రామానికి చెందిన ఆర్.దాలినాయుడు ఫిర్యాదు చేశారు. ఉప



సర్పంచ్ రొంగళి సూరిబాబు నీరు-చెట్టు పథకం చేపట్టి ఆక్రమణదారులకు అండగా చెరువు గట్టు మార్చేశారని తెలిపారు. అధికారులు సర్వే చేపట్టి పూర్వ స్థితికి తీసుకురావాలని కోరారు.

నా సస్పెన్షన్‌ను ఎత్తివేయండి : డా.రామ్‌నాయక్

ఎస్.రాయవరం : తనపై అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేసి, తనకు విధులు నిర్వర్తించుకునేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ డాక్టర్ రామ్‌నాయక్ సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తనపై జిల్లా వైద్యాధికారులు, తమ పీహెచ్‌సీ సిబ్బందితో కలిసి, కక్షగట్టి తనపై తప్పుడు ఆరోపణలు చేసి ఇబ్బందులు పెడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టర్ విజయ్‌కృష్ణన్ సానుకూలంగా స్పందించినట్టు రామ్‌నాయక్ చెప్పారు. పెనుగొల్లు పీహెచ్‌సీలో పనిచేసినప్పుడు



అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న పెనుగొల్లు వైద్యుడు రామ్‌నాయక్

సిబ్బందిని సమయానికి వచ్చి విధులు చేపట్టాలని ఆదేశించినందుకే తనను పదేపదే ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. తనపై చేసిన ఆరోపణలు నిజమని తేలితే తాను ఏ శిక్షకైనా సిద్ధమేనని, పెనుగొల్లు పీహెచ్‌సీని కలెక్టర్ స్థాయి అధికారులు సందర్శించి అక్కడ పనితీరును పర్యవేక్షించాలన్నారు. నిరాధార ఆరోపణలతో జిల్లా వైద్యాధికారులు ఇప్పటికే రెండు దఫాలు సరెండర్ చేయడం, ఇప్పుడు తాజాగా సస్పెండ్ చేయడం వంటి చర్యలు తీసుకున్నారన్నారు. కారణం అడుగుతుంటే సమాధానం ఇవ్వడం లేదని, జిల్లా కలెక్టర్ దృష్టి సారించి తమకు న్యాయం చేయాలని దరఖాస్తు పెట్టుకున్నట్టు చెప్పారు.

గ్రామ కంఠం స్థలం విక్రయంపై ఫిర్యాదు

దేవరాపల్లి : దేవరాపల్లిలో రూ.కోట్లాది రూపాయల విలువ చేసే గ్రామ కంఠం స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయని జిల్లా కలెక్టర్‌కు సీపీ



ఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దేవరాపల్లి రెవెన్యూ సర్వే నెంబర్ 259/2 పినకోట వైపు వెళ్లే రోడ్డుకు ఆనుకొని గ్రామ కంఠం స్థలాలను దేవరాపల్లికి చెందిన గొర్లె దేముడమ్మ, ఇదే గ్రామానికి చెందిన చిట్టూరు గంగరాజు, బేతపూడికి చెందిన గుంపెన రేవతి, కాశీపురానికి చెందిన గండి గోవిందరావుకు గత ఏడాది విక్రయించారన్నారు. దీనికి సంబంధించి ధ్రువపత్రాన్ని వీఆర్వో నూకరాజు జారీ చేశారని, సదరు వీఆర్వోపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

ఎస్పీ కార్యాలయానికి 40 ఫిర్యాదులు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి : ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)కు వివిధ సమస్యలపై 40 ఫిర్యాదులు వచ్చాయని ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుంటూ ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆస్తి తగాదాలు, కుటుంబ సమస్యలు, చీటింగ్, ఇతర సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు అందాయన్నారు. చట్ట పరిధిలో సమస్యలను తక్షణమే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహన్‌రావు, ఎస్ఐ వెంకన్న పాల్గొన్నారు.

నకిలీ విలేకరులపై చర్యలు తీసుకోవాలి

సోషల్ మీడియా పేరుతో హల్‌చల్ చేస్తున్న నకిలీ విలేకరుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు బి.వెంకటేష్ కోరారు. ఈ మేరకు ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఎస్పీ తుహిన్ సిన్హాకు వినతిపత్రం అందజేశారు. బైక్‌లపై, కార్లపై ప్రెస్ స్టిక్కర్లు పెట్టుకుని చలామణి అవుతున్నారని, అటువంటి వారిపై జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, సదరు వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు భాషా, శేఖర్, నాగ, నటరాజ్, నాగు పాల్గొన్నారు.

రేపటి నుంచి సీజీఆర్ఎఫ్ సదస్సులు

సాక్షి, విశాఖపట్నం: ఏపీఈపీడీసీఎల్ పరిధిలో పలాస, విశాఖపట్నం జోన్-2, రంపచోడవరం, జంగారెడ్డిగూడెం డివిజన్లలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 13 నుంచి సదస్సులు నిర్వహించనున్నట్లు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) చైర్‌పర్సన్, విశ్రాంతి జడ్జి బి.సత్యనారాయణ తెలిపారు. 13న పలాస డివిజన్‌లోని ఇచ్ఛాపురం సెక్షన్‌లోను, 19న విశాఖపట్నం జోన్-2 డివిజన్‌లోని మల్కాపురం సబ్ డివిజన్‌లోనూ, 28న రంపచోడవరం డివిజన్‌లోని అడ్డతీగల సెక్షన్‌లో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 29న జంగారెడ్డిగూడెం డివిజన్ పరిధిలోని కొయ్యలగూడెంలో సదస్సు జరగనున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు సదస్సుల్లో నేరుగా పాల్గొని విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, బిల్లుల సమస్యలపై ఫిర్యాదులు చేయవచ్చనిసూచించారు. దీంతోపాటు కనెక్షన్ పేరుమార్పిడి, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో జాప్యం, ట్రాన్స్ ఫార్మర్ల మార్పిడి, తదితర సమస్యలను చైర్‌పర్సన్, సీజీఆర్ఎఫ్ కమిటీకి తెలియజేయవచ్చని తెలిపారు. సీతమ్మధారలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఉన్న సీజీఆర్ఎఫ్ కార్యాలయానికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసే అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. సదస్సులకు సీజీఆర్ఎఫ్ కమిటీ సభ్యులు ఎస్.మసిలమణి, షేక్ బాబర్ హాజరుకానున్నారు.

అద్దె చెల్లించకపోవడంతో సచివాలయానికి తాళాలు



తాళాలు వేసిన లోపూడి సచివాలయం



బయటే ఉండిపోయిన సచివాలయ సిబ్బంది

బుచ్చెయ్యపేట : ప్రైవేటు భవనంలో నడుస్తున్న సచివాలయానికి నెలవారి చెల్లించాల్సిన అద్దె ఇవ్వకపోవడంతో ఇంటి యజమాని తాళాలు వేసిన ఘటన లోపూడిలో జరిగింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో సచివాలయానికి సొంత భవనానికి నిధులు మంజూరు చేసినా కాంట్రాక్టర్ పనులు పూర్తి చేయలేదు. దీంతో లోపూడి సచివాలయ భవనం అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. అయితే ప్రతి నెలా చెల్లించాల్సిన అద్దె చెల్లించకపోవడంతో ఇంటి యాజమాని సోమవారం ఉదయం సచివాలయ భవనానికి తాళాలు వేశారు. దీంతో విధులకు వచ్చిన అధికారులు దిక్కుతోచక బయటే ఉండిపోయారు. తనకు రావాల్సిన అద్దె మొత్తం ఇస్తేనే తాళాలు తీస్తానని ఇంటి యజమాని అధికారులకు తేల్చి చెప్పేశారు. సచివాలయ సెక్రటరీ రామిరెడ్డి తాను ఇటీవలే కొత్తగా విధుల్లో చేరానని, పంచాయతీ రికార్డులు తనకు ఇంకా అప్పగించలేదన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసికెళ్లి పది రోజుల్లో అద్దె చెల్లిస్తామని సర్ది చెప్పారు. దీంతో భవన యజమాని తాళాలు తీయడంతో సిబ్బంది లోపలకు వెళ్లి విధులు నిర్వర్తించారు.

38 వన నర్సరీల్లో 37.3 లక్షల మొక్కల పెంపకం

- సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో లక్ష్మణ్



కొత్తూరు నర్సరీలో పెంచుతున్న మొక్కలను పరిశీలిస్తున్న సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో లక్ష్మణ్

కె.కోటపాడు: జిల్లాలోని 38 వన నర్సరీల్లో 37 లక్షల 30 వేల మొక్కలను పెంచుతున్నామని జిల్లా సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో జి.లక్ష్మణ్ చెప్పారు. వీటిలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో 32 లక్షల 20 వేల మొక్కల పెంపకం చేపట్టామని ఆయన తెలిపారు. ఈ ఏడాది కాలంలో రైతులకు ఉచితంగా పంపిణీ చేయడంతోపాటు ప్రభుత్వ స్థలాల్లో, రోడ్లకు ఇరువైపులా నాటేందుకు వీటిని వినియోగిస్తామన్నారు. మండలంలో రామచంద్రపురం, కొత్తూరు, సింగన్నదొరపాలెం, బత్తివానిపాలెం గ్రామాల్లో గల వన నర్సరీలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ మొక్కలను రైతులకు అందించేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. వీటితోపాటు కంపా స్కీమ్‌లో భాగంగా లక్షా 60 వేల మొక్కలను, సేల్ ఆఫ్ సీలింగ్స్ కింద లక్ష, ఎన్‌టీపీసీ నిధులతో 2 లక్షలు, జీరో వన్‌నైన్ మిక్స్‌డ్ ప్లాంటేషన్ కింద మరో లక్ష మొక్కలను నర్సరీలలో పెంచుతున్నట్లు ఆయన తెలిపారు. నర్సరీలలో సరుగుడు, నీలగిరి మొక్కలను ఆరు నెలల కాలం పెంచనున్నట్లు ఆయన తెలిపారు. టాల్ ప్లాంటేషన్ మొక్కలను ఏడాదిపాటు నర్సరీలలో పెంచడం వలన మొక్కలు ఆరోగ్యకరంగా ఎదుగుతాయని, తద్వారా నర్సరీ నుంచి నాటేందుకు తీసుకువెళ్లిన ప్రతి మొక్క బతుకుతుందని ఆయన తెలిపారు. అనకాపల్లి జిల్లా రేంజ్ అధికారి జి.చంద్రశేఖర్, డిప్యూటీ రేంజ్ అధికారి ఎ.నూకరాజు, వన సేవకుడు చిరికి గోవింద పాల్గొన్నారు.

నాగయ్యపేట వెల్‌నెస్ సెంటర్‌ను సందర్శించిన టాస్క్‌ఫోర్స్ బృందం

దేవరాపల్లి: దేవరాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నాగయ్యపేట హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను సోమవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు సందర్శించారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ బృంద సభ్యులు డా. లూసీ, డా.ఎ.రామచంద్రరావు, జగదీష్, జగన్నాథం తదితర్లు గ్రామంలో పర్యటించి ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవలపై ఆరా తీశారు. గర్భిణులు, కిశోర బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించి రక్త హీనతతో కలిగే అనర్థాలను వివరించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి అక్కడి విద్యార్థులకు సైతం రక్త పరీక్షలు జరిపారు. వీరి వెంట పీహెచ్‌సీ పీహెచ్ఎన్ సునీత, హెల్త్ సూపర్‌వైజర్ జి.కె.పుష్పరాజ్, హెచ్‌వి బి.లక్ష్మి, ఏఎన్ఎం ఆర్.సత్యవతి, ఎంఎల్‌హెచ్‌పీ అనంతలక్ష్మి తదితర ఇతర వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

సీలింగ్ మిగులు భూములకు పట్టాలివ్వాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఆదివాసీ గిరి రైతులు

మాడుగుల : మండలంలో జాలంపల్లి, కుర్మనాథపురం, పెదకుర్మం గ్రామాల ఆదివాసీ రైతులు తాము సాగు చేస్తున్న సీలింగ్ మిగులు భూములకు పట్టాలివ్వాలని, ఏపీ ఆదివాసీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట శాంతియుతంగా నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ సంఘం గౌరవ సలహాదారుడు అజయ్ కుమార్ మాట్లాడుతూ జాలంపల్లి పంచాయతీలో 30 ఏళ్లుగా 175 కుటుంబాలు సీలింగ్ మిగులు భూములు సాగుచేస్తున్నారని, తమ సాగు అనుభవాన్ని గుర్తించి వారికి పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పట్టాలివ్వక పోవడం వల్ల ప్రభుత్వ రాయితీ వారికి నేటికీ అందడం లేదన్నారు. శంకరం పంచాయతీలో కూడా ఇటువంటి భూములకు పట్టాలివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘం జిల్లా కార్యదర్శి ఇరటా నరసింహమూర్తి, ఆదివాసీ గిరి రైతులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి

- కోడాపల్లిలో సీపీఎం నిరసన



కోడాపల్లిలో నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం మండల కార్యదర్శి దొర తదితరులు

దేవరాపల్లి: కూటమి ప్రభుత్వంలో విపరీతంగా పెరిగిన విద్యుత్, నిత్యావసర సరకుల ధరలు తక్షణమే తగ్గించాలని లేకుంటే ప్రజలతో కలిసి ఉద్యమం చేపడతామని సీపీఎం మండల కార్యదర్శి బి.టి.దొర డిమాండ్ చేశారు. మండలంలోని వాలాబు పంచాయతీ కోడాపల్లిలో పెరిగిన విద్యుత్, నిత్యవసర ధరలను నిరసిస్తూ స్థానిక ప్రజలతో కలిసి సోమవారం ఆందోళన చేపట్టారు. సీపీఎం మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం బి.టి.దొర మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో చంద్రబాబు సహా కూటమి నాయకులు ధరల పెరుగుదలపై బాదుడే బాదుడు అంటూ ఊరు వాడా ఊదరకొట్టి, అధికారంలోకి రాగానే ఇచ్చిన మాటను మరిచిపోయి, మరింత ధరలు పెంచడం అత్యంత దారుణమన్నారు. మహిళలు, చిన్నారులపై దాడులు, అత్యాచారాలు అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. పరిశ్రమలలో స్థానికులకు 75 శాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, ఇసుక దోపిడీని నివారించి, ప్రజలకు ఉచితంగా ఇసుక అదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాంబాబు, శంకరరావు, సుధాకర్, దుప్పి దాసు, ఇరటా ఈశ్వరరావు, సోమల రమణ బాబు, దుప్పి నారాయణ పాల్గొన్నారు.

చిన్నారుల కళా నైపుణ్యం భళా



టెంపరేచర్ కేర్ నమూనాతో విద్యార్థిని



సంగీత ప్రియులను రూపొందించిన విద్యార్థి



గర్ల్ ప్రతిరూపంతో విద్యార్థి



వినాయకుడి విగ్రహాన్ని తయారు చేసిన విద్యార్థిని


నర్సీపట్నం : జిల్లాస్థాయి కళాకృతి పోటీల్లో విద్యార్థినీ విద్యార్థులు పోటీ పడ్డారు. బాలల దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పీఆర్‌టీయు నిర్వహిస్తున్న జిల్లాస్థాయి ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా సోమవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కళాకృతి పోటీలకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. చిన్నారులు మట్టితో దేశ నాయకులు, భరతమాత, దేవుళ్ల ప్రతిరూపాలను అందంగా తయారు చేసి వారి నైపుణ్యాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు డి.గోపినాథ్ మాట్లాడుతూ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని 13 ఏళ్లుగా ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న కళాత్మకతను వెలికి తీసేందుకు ఈ పోటీలను ఏర్పాటు చేశామన్నారు. విజేతలకు నవంబరు 14న సిటీ క్లబ్ అవరణలో నిర్వహించే వేడుకల్లో బహుమతులు అందజేస్తామన్నారు.

రెండు హేచరీలకు అటవీ,పర్యావరణ అనుమతులు

యలమంచిలి రూరల్ : యలమంచిలి అటవీ పరిధిలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న రెండు రొయ్యల హేచరీలకు అటవీ, పర్యావరణ అనుమతులు మంజూరయ్యాయి. ఎస్ రాయవరం మండలం రేబాక బీట్, కె.పోలవరం ఫారెస్ట్ బ్లాక్‌లో సాయి ఆక్వా హేచరీ, లక్ష్మీనరసింహ హేచరీలకు అవసరమైన సముద్రపు నీటిని సమీపంలో ఉన్న బంగాళాఖాతం నుంచి తీసుకోవడానికి వీలుగా పీవీసీ పైప్‌లైన్‌ను వేయాల్సి ఉంది. ఈ పైప్‌లైన్ మార్గంలో అటవీ స్థలం ఉంది. దీంతో సంబంధిత యాజమాన్యాలు అటవీ శాఖకు అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నాయి. పలు నివేదికలు, ఉత్తర ప్రత్యుత్తరాల తర్వాత హేచరీల యాజమాన్యాలకు అనుమతి మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. అనంతరాము సోమవారం జీవీఎంఎస్ 48, 49 జారీ చేశారు. వీటి ప్రకారం సాయి ఆక్వా హేచరీ యాజమాన్యానికి 0.11 హెక్టార్లు, లక్ష్మీనరసింహ హేచరీకి 0.06 హెక్టార్ల అటవీ భూమిని పీవీసీ పైప్‌లైన్ వేయడానికి అనుమతి ఇచ్చింది ప్రభుత్వం. ఈ అటవీ భూమి చట్టపరమైన స్థితి ఎప్పటికీ మారదని, అదనంగా ఎలాంటి దారులు నిర్మించకూడదని, అనుమతుల్లో మంజూరు చేసిన కార్యకలాపాలకు తప్ప మరే ఇతర అవసరాలకు ఈ భూమిని వినియోగించకూడదని, సమీపంలో ఉన్న వృక్ష సంపద, జంతుజాలానికి ఎటువంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని..ఇలా యాజమాన్యాలు అనుసరించాల్సిన 27 నియమ నిబంధనలు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీటిని ఉల్లంఘిస్తే వెంటనే అనుమతులు రద్దు చేయడంతో పాటు సంబంధిత అటవీ, పర్యావరణ చట్టాల ప్రకారం చర్యలు తీసుకోనున్నట్టు ఉత్తర్వుల్లో పొందుపరిచారు.

భయాన్ని వీడి.. ధైర్యంగా అడుగేయండి

- అప్పుడే విద్యార్థులకు విజయాలు
- ప్రముఖ రచయిత యండమూరి



కశింకోట: విద్యార్థులు భయాన్ని వీడి మొక్కవోని ధైర్యంతో తమ లక్ష్యాలను సాధించడానికి కృషి చేయాలని ప్రముఖ నవలా రచయిత, సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ యండమూరి వీరేంద్రనాథ్ చెప్పారు. కశింకోటలోని సెయింట్స్ జాన్స్ స్కూలులో సోమవారం 'విజయ మార్గానికి సోపానాలు' అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదవాలని అప్పుడే చదువు ఒంటపడుతుందన్నారు. ఉపాధ్యాయులు కూడా అర్థమయ్యే రీతిలో బోధన సాగించి విద్యార్థుల వికాసానికి దోహదపడాలన్నారు. చిరునవ్వు చిందిస్తూ విద్యార్థులను ఆకట్టుకునే విధంగా పాఠాలు బోధించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు.

సంతృప్తికరంగా సమాధానాలు రావడంతో అభినందనలు తెలియజేశారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు పతకాలను అందజేసి ప్రోత్సహించారు. స్కూలు కరస్పాండెంట్ బత్తుల అనూరాధ, ప్రిన్సిపాల్ రూపనంది, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

చెకుముకి పోటీల్లో శ్రీప్రకాష్ విద్యార్థుల ప్రతిభ



విజేతలతో కరెస్పాండెంట్ నరసింహారావు

పాయకరావుపేట : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 9, 10 తేదీల్లో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు - 2024 పోటీల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థులు ఎస్.కిరణ్ (8వతరగతి), ఎం.సాత్విక్ (9వ తరగతి), ఓ.సాయి శ్రావణ్ జయదీప్ (10వ తరగతి) బృందం చక్కని ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానాన్ని సాధించారని విద్యా సంస్థల సీనియర్ ప్రిన్సిపాల్ మూర్తి తెలిపారు. పాఠశాల, మండల, జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో 52 బృందాలు పాల్గొనగా, తమ విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించడం హర్షణీయమని అన్నారు. విజేతలను విద్యా సంస్థల అధినేత నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్, అభినందించారు.

లారీ డ్రైవర్ మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి

యలమంచిలి రూరల్ : మండలంలోని పోతురెడ్డిపాలెం వద్ద నాలుగు రోజుల క్రితం మృత్యువాత పడిన తెలంగాణ రాష్ట్రానికి చెందిన లారీ డ్రైవర్ పాముల చందు(36) మృతదేహానికి సోమవారం యలమంచిలి మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించారు. జాతీయ రహదారి పక్కన గుర్తించిన చందు మృతికి సంబంధించిన కారణాలు ఇంకా స్పష్టంగా తెలియలేదు. బాగా మద్యం సేవించడం వల్ల మృతి చెంది ఉంటాడా? లేక విషపూరితమైన పదార్థం ఏమైనా తీసుకున్నాడా? అన్నది పోస్టుమార్టం నివేదిక వచ్చాక తేలుతుందని యలమంచిలి రూరల్ ఎస్ఐ ఉపేంద్ర చెప్పారు. మృతదేహంపై ఎలాంటి గాయాలు లేవని, శరీరంలో ఎముకలు విరగడం వంటివి కూడా లేవని ప్రాథమికంగా తేలింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని మృతుని కుటుంబీకులకు అప్పగించినట్టు చెప్పారు. తెలంగాణ రాష్ట్రం భువనగిరి మండలం బస్వాపురం గ్రామానికి చెందిన చందు భార్య, ముగ్గురు పిల్లలు, బంధువులు సోమవారం యలమంచిలి వచ్చారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

క్లుప్తంగా

జోనల్ కార్యాలయానికి 5 అర్జీలు



అర్జీదారుడి నుంచి ఫిర్యాదు స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్ రమణ

అనకాపల్లి: స్థానిక జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 5 అర్జీలు వచ్చినట్లు జెడ్సీ బి.వి.రమణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఉదయం 10 నంంచి నిర్వహిస్తున్నామన్నారు. జోన్ పరిధిలో ప్రజల సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోనల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శూలాల మహోత్సవం

కశింకోట: మండలంలోని బంగారయ్యపేట గ్రామంలో సోమవారం రాత్రి చౌడేశ్వరి సమేత సాంబమూర్తి శూలాల మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పలువురు భక్తులు ఉపవాస దీక్షలో ఉండి గంప శూలం, సుబ్రహ్మణ్య, నక్షత్ర శూలాలు, బుగ్గ శూలాలు ధరించి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

విద్యార్థులకు నేత్ర పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

కశింకోట: నరసింగబిల్లి హైస్కూలులో విద్యార్థులకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి యు.రమేష్ పర్యవేక్షణలో కంటి పరీక్షలు చేశారు. కళ్లజోళ్లు అవసరమైన విద్యార్థులను గుర్తించారు. వారికి అంధత్వ నివారణ సంస్థ ద్వారా మూడు నెలల్లో ఉచితంగా కళ్లజోళ్లు అందించనున్నట్టు ఆప్తాలమిక్ అధికారులు సిహెచ్.ప్రసాదరాజు, యు.ఆనందరావు తెలిపారు. హెచ్ఎం బి.సునీత, ఆరోగ్య బోధకుడు ఎం.ఎస్.వి.ప్రసాద్, ఆరోగ్య పర్యవేక్షకుడు కె.ఎస్.ఆర్.కె.జి.నరసింహారావు, ఎంఎల్‌హెచ్‌పీ ఎం.ఉమా, ఆరోగ్య, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 3,510 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,820	4,560
మొదటి రకం	3,780	4,450
రెండో రకం	3,560	3,910
మూడోరకం	3,200	3,550

అనకాపల్లి సినిమాలు

దేవర	: రాజా
'క'	: సత్యనారాయణ స్క్రీన్-1
అమరాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
అప్పుడో ఇప్పుడో ఎప్పుడో	:పర్తిసాయి
బ్లడీ బెగ్గర్	: షిర్డిసాయి
ధూం ధాం	:వెంకటేశ్వర
విశ్వం	: శ్రీసత్య
లక్కీ భాస్కర్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 55 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-6 యూనిట్లు, బీ పాజిటివ్-18 యూనిట్లు, ఓ పాజిటివ్-30 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్‌ను (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 428 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 394 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబరును సంప్రదించవచ్చును.

క్యాన్సర్‌పై యుద్ధం

- మొదటి దశలో గుర్తిస్తే నివారణ సాధ్యం
- 18 ఏళ్లు పైబడిన ప్రతి వ్యక్తికి ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు
- ఈ నెల 14 నుంచి 9 నెలల పాటు ఇంటి వద్దనే పరీక్షలు



క్యాన్సర్‌పై తుమ్మపాలలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్యురాలు వాణి జగదీశ్వరి(ఫైల్)

అనకాపల్లి: ప్రస్తుతం ప్రజలను వణికిస్తున్న మహమ్మారి క్యాన్సర్. ఇది చాప కింద నీరులా విస్తరిస్తోంది. వ్యాధి సోకిన రోగి తెలుసుకునేలోపు చివర దశకు చేరుకోవడంతో ఆందోళన కలిగిస్తోంది. ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఛిన్నాభిన్నం చేస్తోంది. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాయి. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై విజయం సాధించాలనే ధృడ సంకల్పంతో గ్రామీణ స్థాయి నుంచి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. ఈ నెల 14వ తేదీ నుంచి 18 సంవత్సరాలు పైబడిన ప్రతి వ్యక్తికి ఇంటింటికీ వెళ్లి స్థానిక ఆరోగ్య సిబ్బంది ద్వారా ప్రాథమిక క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందు కోసం వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రత్యేక యాప్‌ను రూపొందించారు. క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహణపై వైద్య ఆరోగ్య సిబ్బందికి ఎన్టీఆర్ ఆస్పత్రి, తుమ్మపాల, సీతానగరం, యూపీహెచ్‌సీల్లో వైద్య సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు సైతం నిర్వహించారు.

ప్రథమ దశలో వ్యాధిని గుర్తించడమే లక్ష్యం

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 ప్రకారం క్యాన్సర్, దాని ప్రారంభం దశను చాలా ఆలస్యంగా గుర్తిస్తున్నట్టు తేలింది. రోగ నిర్ధారణ ఆలస్యమవడంతో వ్యక్తుల మరణాలకు దారితీస్తుంది. దీంతో క్యాన్సర్ మహమ్మారిని ఎదుర్కొనేందుకు ముందస్తుగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తిస్తే మరణాల సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చును. క్యాన్సర్ నివారణ, ముందస్తు రోగ నిర్ధారణ, మెరుగైన ఫలితాల కోసం ఈ నెల 14 నుంచి గ్రామాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి స్క్రీనింగ్ పరీక్షలు చేసేందుకు సన్నద్ధమయ్యారు.

విస్తృతంగా అవగాహన ర్యాలీలు

అనకాపల్లి మండలంలో తుమ్మపాల, సీతానగరం పీహెచ్‌సీ పరిధిలో 32 పంచాయతీలలో ఇప్పటికే క్యాన్సర్ స్క్రీనింగ్‌పై వైద్య సిబ్బంది ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 14 నుంచి 9 నెలలపాటు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయనున్నారు. మండల పరిధిలో సుమారుగా 65 వేలు మందికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు. ప్రాథమిక లక్షణాలు ఉన్నట్లయితే సదరు రోగిని జిల్లా వైద్యాలయానికి తరలించి, మొదటి దశలో పూర్తిస్థాయిలో మందులు పంపిణీ చేసి, క్యాన్సర్ ఆస్పత్రికి పంపిస్తారు. క్యాన్సర్ లక్షణాలు ప్రాథమిక దశలో గుర్తించేందుకు వైద్య ఆరోగ్యశాఖ ఒక ప్రత్యేక మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆయుష్మాన్ భారత్ సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నారు.



గొలగాం గ్రామంలో ప్రజలకు క్యాన్సర్‌పై ఇటీవల అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

భయపడకుండా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి



క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు భయపడకుండా చేయించుకోవాలి. మొదటి దశలో క్యాన్సర్ లక్షణాలు గుర్తించినట్లయితే సకాలంలో మందులు వాడుతూ ఆరోగ్యంగా జీవించవచ్చును. మహిళలు రొమ్ము, గర్భాశయ క్యాన్సర్‌తో ఎక్కువగా బాధపడుతున్నారు. మొదటి దశలో తెలుసుకోవడం ఎంతో మేలు జరుగుతుంది. ఈ నెల 14 నుంచి తొమ్మిది మాసాలు పాటు వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు చేస్తారు. పూర్తి వివరాలను యాప్‌లో నమోదు చేస్తారు. గతంలో టీబీ వ్యాధి సోకిన వ్యక్తిని చూసి భయపడేవారు. ఇప్పుడు అటువంటి సమస్యలు లేకుండా మందులు వాడితే తగ్గిపోతుంది. అలాగే మందులు వాడితే క్యాన్సర్ కూడా తగ్గిపోతుంది.

– నజరత్ సమీమ్, తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యురాలు

మాదక ద్రవ్యాలతో జీవితం నాశనం



మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషి చేస్తామంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీసులు

కశింకోట: మాదక ద్రవ్యాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని సీఐ అల్లు స్వామినాయుడు కోరారు. కశింకోటలోని ఏపీఈపీడీసీఎల్ డివిజనల్ కార్యాలయంలో ఉన్న రాజీవ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై పోలీస్ శాఖ తరపున 'సంకల్పం'సదస్సు నిర్వహించి విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల జీవితాలు నాశనమవుతాయన్నారు. సామాజిక, మానసిక, శారీరక అనారోగ్యాలకు గురికావలసి ఉంటుందన్నారు. గంజాయి పంట సాగు, వినియోగం, రవాణా చట్ట ప్రకారం నేరాలుగా పరిగణిస్తామని చెప్పారు. మాదక ద్రవ్యాల నేరాలకు పాల్పడే వారికి 20 ఏళ్ల వరకు కఠిన కారాగార శిక్షలున్నాయన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలనే విద్యార్థుల లక్ష్యం కావాలన్నారు. ఇందుకు అంతా సమష్టిగా కృషి చేయాలని కోరారు. మాదక ద్రవ్యాలను అరికట్టడానికి కట్టుబడతామంటూ ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మణరావు, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శివ, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత ఇసుక అందరికీ అందాలి



అనకాపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కశింకోట: ప్రైవేటు ఏజెన్సీలకు ఉచిత ఇసుకను అప్పగించొద్దని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు వై.ఎన్ భద్రం కోరారు. ఏఐటీయుసీ ఆధ్వర్యంలో వివిధ ప్రజా సంఘాలు అనకాపల్లిలో ధర్నా, ర్యాలీ జరిపి ఆర్డీవోకు వినతి పత్రాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అపహస్యం చేస్తుందని, దాని సరిచేసి అందరికి ఉచిత ఇసుక అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రం అనకాపల్లిలో ఇసుక స్టాక్ పాయింట్‌ను ఏర్పాటు చేసి అందుబాటులో ఉంచాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించి సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యుడు సన్యాసిరావు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆ రైళ్ల హాల్ట్ కోసం వినతి

కశింకోట: అనకాపల్లిలో సుమారు 20 వరకు రైళ్లు ఆగడం లేదని, వాటిని నిలపడానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ మాజీ వైఎస్ చైర్మన్ విల్లూరి పైడారావు కోరారు. ఈ మేరకు ఎంపీ సీఎం రమేష్‌కు సోమవారం ఆయన వినతి పత్రం అందజేశారు. విశాఖ -లోకమాన్య తిలక్, హౌరా-చెన్నై, హౌరా-సికింద్రాబాద్, విశాఖ-సికింద్రాబాద్‌ల మధ్య నడిచే రోజువారీ రైళ్లు, భువనేశ్వర్-బెంగళూరు, షాలిమార్-వాస్కోడిగామా, సత్రగంచి-తిరుపతి, విశాఖ-కొల్లాం, విశాఖ-గాంధీధామ్, భువనేశ్వర్-తిరుపతి మధ్య నడిచే స్పెషల్ రైళ్లు ఆగడం లేదన్నారు. దీంతో విశాఖ, దువ్వాడ స్టేషన్లకు వ్యయ ప్రయాసలకోర్చి చేరుకొని రైళ్లు ఎక్కాల్సి వస్తోందని వాపోయారు. ఇబ్బందులను గుర్తించి అనకాపల్లిలో ఆయా రైళ్లు ఆగేలా చర్యలు చేపట్టాలని కోరారు.

స.హ. చట్టంపై అవగాహన ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

అనకాపల్లి: సమాచార హక్కు చట్టంపై వ్యవసాయ సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని ఎంపీపీ గొర్లి సూరిబాబు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల వ్యవసాయశాఖ అధికారి పి.రంగాచారి ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రతి పౌరుడు ఈ చట్టంపై అవగాహన పెంచుకుని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరసింహారావు, పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్‌మెంట్ అధికారి రవి ప్రసాద్, మండలంలో పంచాయతీ కార్యదర్శులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘం అదనపు ప్రధాన కార్యదర్శిగా 'బోయిన'



సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంగళరావు నుంచి నియామక పత్రం అందుకుంటున్న భానుమూర్తి

కశింకోట: జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర శాఖ అదనపు ప్రధాన కార్యదర్శిగా అనకాపల్లికి చెందిన బోయిన భానుమూర్తి యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు శ్రీశైలంలో ఆదివారం జరిగిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర శాఖ సమావేశంలో రాష్ట్ర శాఖ అధ్యక్షుడు వెంగళరావు నుంచి ఆయన నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా బీసీల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని బోయిన తెలిపారు. రాష్ట్రంలో బీసీ గణన, విద్యార్థులకు ఉపకార వేతనాలు అందడానికి, బీసీ వసతి గృహాల్లో సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానన్నారు.

ఇసుక ర్యాంపులను ప్రభుత్వమే నిర్వహించాలి



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

అనకాపల్లి: ఇసుక తవ్వకం ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించడం అన్యాయమని, ప్రభుత్వమే నడపాలని ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం(ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వమే ఇసుక ర్యాంపులు నడపాలని, ఇసుకపై అన్ని రకాల పన్నులు ఎత్తివేయాలని, భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునఃప్రారంభించాలని, పెండింగ్‌లో ఉన్న 42 వేల క్లెయిమ్స్‌కు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రాజాన దొరబాబు, ఎస్.సన్యాసిరావు,నూకరాజు, రామారావు, సుబ్రమణ్యం, సిహెచ్.అప్పలరాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు గృహాలు నిర్మించి ఇవ్వాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రాజాన దొరబాబు

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికల్లో నిరుపేదలకు గృహాలు మంజూరు చేస్తామని ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని కోరుతూ ఈ నెల 18న సచివాలయాల వద్ద అర్జీలు అందజేస్తామని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు తెలిపారు. స్థానిక కోడిగంటి గోవిందరావు భవనంలో అర్జీల కరపత్రాలను సోమవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సుమారుగా ఐదు మాసాలు అవుతున్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలలో ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. బడుగు, బలహీన వర్గాలకు మండలంలో 3 సెంట్లు, పట్టణ పరిధిలో 2 సెంట్లలో గృహాలు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు.

భూసేకరణపై నిరసన

అనకాపల్లి: మండలంలో వేటజంగాలపాలెం, పాపయ్యసంతపాలెం గ్రామాల్లో ల్యాండ్ పూలింగ్ పేరుతో సేకరించిన భూములను ఇవ్వబోమని సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులు సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ మాట్లాడుతూ విశాఖ ఉమ్మడి జిల్లాలో ల్యాండ్ పూలింగ్ పేరుతో 10 మండలాల పరిధిలో 54 గ్రామాల్లో 6116.50 ఎకరాలను సేకరించడానికి గ్రామ సభలు నిర్వహించారని చెప్పారు. రైతులు, చిన్న, సన్నకారుల రైతులు, కూలీలు, వృత్తికారులు భూములు ఇవ్వలేమని ముక్తకంఠంతో వ్యతిరేకించారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

వారాహి అమ్మవారి ఊరేగింపు



వారాహి అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

అనకాపల్లి: స్థానిక విజయరామరాజుపేటలో వారాహి అమ్మవారిని సోమవారం ఊరేగించారు. ఈ సందర్భంగా కనక దుర్గ శక్తిపీఠం గురుస్వామి ఇల్లా ఈశ్వరరావు మాట్లాడుతూ చండీ హోమం సందర్భంగా 41 రోజుల పాటు దీక్షలు నిర్వహిస్తున్న భక్తులు వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారన్నారు.

మార్మోగిన శివ నామ స్మరణ



మెయిన్ రోడ్డు సిద్ధిలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఆలయ అర్చకుడు



వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో శివలింగానికి పూజలు చేస్తున్న ఆలయ అర్చకులు



అరటిపళ్ళ మార్కెట్ వద్ద సాధువుల ఆలయంలో శివుడికి పూజలు చేస్తున్న భక్తులు

అనకాపల్లి: కార్తీక మాసం రెండో సోమవారం శైవ క్షేత్రాలు శివ నామస్మరణతో మార్మోగాయి. పట్టణ, మండల పరిధిలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. హరహర మహాదేవ.. శంభో శంకర అంటూ పరమేశ్వరుడిని దర్శించుకుని తరించారు. పట్టణంలో వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరస్వామి, మెయిన్‌రోడ్డు సిద్ధిలింగేశ్వరస్వామి, గవరపాలెం కోటవీధి భోగలింగేశ్వరస్వామి, శారదానది ఒడ్డున, గాంధీనగరం ఉమారామలింగేశ్వరస్వామి, చిన్నరాజుపేట సాంబశివుని ఆలయం, అరటిపళ్ల మార్కెట్ వద్దనున్న సాధువుల ఆలయాల్లో శివలింగానికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలో అక్కిరెడ్డిపాలెం, శీరంశెట్టివానిపాలెం, గోపాలపురం, మామిడిపాలెం, బవులవాడ, సీతానగరం, కొత్తూరు, వల్లూరు గ్రామాల శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ధ్వజస్తంభాలు, జమ్మిచెట్టు, తులసి, వేప, మారేడు చెట్ల వద్ద మహిళలు దీపారాధన చేశారు. బ్రాహ్మణులకు దానాలు చేశారు. స్థానిక మెయిన్‌రోడ్డు కుంచావారివీధి గౌరీపరమేశ్వరుల ఆలయంలో శివ పార్వతుల కల్యాణాన్ని దాడి గణేష్, సుష్మా, శ్రీనివాస్, సత్యవతి దంపతులు చేతుల మీదుగా ఆలయ అర్చకులు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ వద్ద భారీ అన్నసమారాధన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఎం.వీరభద్రరావు, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. బట్లపూడి పంచాయతీ సోహం ఆశ్రమంలో మహా మృత్యుంజయ హోమం నిర్వహించారు. భక్తులకు మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమం చేపట్టారు.

కశింకోట: మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కశింకోటలోని పురాతన శివాలయంలో వేకువ జాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరిపారు. కస్పా వీధి సాంబశివుని ఆలయం, గవరపేటలోని ఉమా శంకరాలయంలో అర్చకులు ప్రసాద్, సుబ్రహ్మణ్యం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. వెదురుపర్తిలోని రామలింగేశ్వరస్వామి ఆలయం, బయ్యవరం, పేరంటాలపాలెం, సోమవరం, చింతలపాలెం, నూతలగుంటపాలెం, కన్నూరుపాలెంలలోని శివాలయాలు, ఉగ్గినపాలెంలోని సోమేశ్వరస్వామి ఆలయం, తాళ్లపాలెం సంతలోని రామలింగేశ్వరస్వామి ఆలయం, బంగారయ్యపేటలోని బసవేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కుంచావారి గౌరీపరమేశ్వరుల ఆలయం వద్ద అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు



బట్లపూడిలో సోహం ఆశ్రమంలో మహా మృత్యుంజయ హోమం నిర్వహిస్తున్న భక్తులు



సిద్ధిలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సందడి



జమ్మిచెట్టు వద్ద పూజలు చేస్తున్న భక్తులు



కుంచావారి గౌరీపరమేశ్వరుల ఆలయంలో శివ కల్యాణం నిర్వహిస్తున్న దాడి గణేష్ దంపతులు

జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు లాస్యత్



శ్రీసూర్య లాస్యత్

తుమ్మపాల : జాతీయ స్థాయిలో డిసెంబర్ 5 నుండి 9 వరకు మైసూర్‌లో జరిగే రోలర్ స్కేటింగ్ పోటీలకు పట్టణానికి చెందిన బాలుడు వీరమాచనేని శ్రీసూర్య లాస్యత్ ఎంపికైనట్టు వీల్స్ ఆఫ్ ఫైర్ స్కేటింగ్ క్లబ్ కోచ్ పవన్ కుమార్ తెలిపారు. ఇటీవల కాకినాడలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ 36వ ఇంటర్ డిస్ట్రిక్ట్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ 2024లో క్లబ్‌లో కోచింగ్ తీసుకున్న వీరమాచనేని శ్రీసూర్య లాస్యత్ స్టేట్ రోలర్ స్కేటింగ్ అండర్ 7 విభాగంలో ఏకంగా రెండు గోల్డ్ మెడల్స్ సాధిం చాడని ఆయన తెలిపారు. అక్టోబర్ 9 నుంచి 12 తేదీ వరకు జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించిన సూర్య రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరచినట్టు తెలిపారు. పట్టణంలో శ్రీ చైతన్య స్కూల్లో రెండో తరగతి చదువుతున్న సూర్యను తన తండ్రి రామకృష్ణ చిన్న వయసు నుండే స్కేటింగ్ మీద మక్కువ పెరిగేలా తయారు చేశారన్నారు. తన విద్యార్థులందరిలో సూర్య ఉత్తమ ప్రతిభ కనపరిచేవాడని, సూర్యకి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రావాలని కోచ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

నృత్య కళా వేదిక ప్రారంభం

పరవాడ: పి.బొనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సంస్కృతి నృత్య కళా వేదికను దూరదర్శన్ నృత్య దర్శకురాలు హేమసాయి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నృత్య విద్యార్థుల ఉన్నతికి ఈ వేదిక దోహదపడుతుందన్నారు.